AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
20-4-2026 | NIZAMABAD / KAMAREDDY | PAGES - 2

ఆర్మూర్ బల్దియాలో ఆ ముగ్గురు..! 2





విద్యుత్‌షాక్‌తో రైతు మృతి 2

## స్వాగత తోరణం నిర్మాణానికి భూమిపూజ



**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలో మున్నూరుకాపు సంఘం స్వాగత తోరణం నిర్మాణానికి సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గోనె లహరి భూమి పూజ నిర్వహించారు. కమాన్‌ను దివంగత ఆకుల పెద్ద లింగవ్వ జ్ఞాపకర్థం ఆమె మనవళ్లు సర్వ సమాజ్ మాజీ అధ్యక్షుడు ఆకుల రాజు, ఎన్ఆర్ఐ ఆకుల రాకేష్ నిర్మిస్తున్నారు. కార్యక్రమానికి కౌన్సిలర్ సడక్ వినోద్, రాణి సుమన్, ఆకుల రాజు, మున్నూరు కాపు అధ్యక్షుడు కలిగొట గంగాధర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## పదోన్నతులు బాధ్యతను మరింత పెంచుతాయి..: సీపీ


**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పోలీస్‌శాఖలో పదోన్నతులు బాధ్యతను మరింత పెంచుతాయని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు నలుగురు కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి రాగా.. వారిని సీపీ కార్యాలయం లో అభినందించారు. ఈ సందర్భంగా నలుగురు కానిస్టేబుళ్లకు సీపీ బ్యాడ్జీలను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. డీజీపీ ఆదేశాల ప్రకారం.. వారికి పదోన్నతులు లభించాయన్నారు. ప్రమోషన్ తర్వాత మరింత నిక్కచ్చిగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. వర్ని పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ కె.ఆనంద్, 2వ టౌన్ పోలీస్ స్టేష,న్‌లో సతీష్, ధర్పల్లి పోలీస్‌స్టేషన్‌లో కె.నవీన్ కుమార్, వన్ టౌన్‌లో శశిప్రసాద్‌లు హెడ్‌కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు.

## కొనుగోలు కేంద్రాల కోసం రోడ్డెక్కిన రైతన్న..




**అక్షరటుడే, గాంధారి:** ప్రభుత్వం మొక్కజొన్న, జొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు రోడ్డెక్కారు. గాంధారి మండల కేంద్రంలో బాన్సువాడ గాంధారి రహదారిపై వారు సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు మాట్లాడుతూ ఇదివరకే తహశీల్దార్, మార్క్‌ఫెడ్ అధికారులకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందించామని.. అయినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేదన్నారు. దీంతో గతిలేని స్థితిలో రోడ్డుపై ధర్నా చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంటకు ప్రభుత్వం ధర రూ.2,400 నిర్ణయిస్తే.. దళారులు రూ.1,700 నుంచి కొనుగోలు చేస్తున్నారని వివరించారు. అంతేకాకుండా జొన్నకు ప్రభుత్వం రూ.3,700 ఉండగా దళారులు రూ.2,600 కొనుగోలు చేస్తున్నారని వాపోయారు.

# టికెట్ కోసం ప్రయత్నాలు



- వచ్చే నెలలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు
- నేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు
- ఎంపీపీ, జెడ్పీ పీఠాలపై పార్టీల ఫోకస్
- జిల్లాలో మహిళా ఓటర్లే అధికం

**రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధం అవుతోంది. వచ్చే నెలలో ఎలక్షన్లు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. దీంతో జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ టికెట్ కోసం ఆశావహులు ప్రయత్నాలు ప్రారంభించారు. రిజర్వేషన్ అనుకూలంగా వస్తే పోటీ చేద్దాం అనుకుంటున్న వారు నేతలను కలిసి టికెట్ ఇప్పించాలని కోరుతున్నారు. మరోవైపు ఆయా పార్టీలు సైతం బలమైన అభ్యర్థుల కోసం చూస్తున్నాయి.** - భీమ్‌గల్, అక్షరటుడే

రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియను సైతం పూర్తి చేయాలని చూస్తోంది. త్వరలో పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానున్నాయి. వేసవి సెలవుల్లో ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. దీంతో ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సందడి మొదలైంది. టికెట్ కోసం చాలా మంది పోటీపడుతున్నారు.

### మహిళా ఓటర్లే కీలకం..

ఇటీవల ఎన్నికల సంఘం విడుదల చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలో మహిళా ఓటర్ల ఆధిపత్యం స్పష్టంగా కనిపిస్తోంది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,51,417మంది ఓటర్లు ఉండగా, అందులో 4,54,621 మంది మహిళలే. అంటే పురుషుల కంటే మహిళా ఓటర్లే అత్యధికంగా ఉన్నారు.

### చైర్మన్ పీఠంపై కన్ను

జిల్లాలో ఇటీవల జరిగిన పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ హవా కొనసాగింది. ఆ పార్టీ మెజారిటీ స్థానాలు గెలుచుకుంది. అయితే బీఆర్ఎస్, బీజేపీ సైతం పలు చోట్ల గెలుపొందాయి. ఈ క్రమంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను మూడు పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. అన్ని పార్టీలు జెడ్పీ పీఠం దక్కించుకోవాలని కసరత్తు చేస్తున్నాయి. అలాగే మెజారిటీ ఎంపీపీలను గెలుచుకొని సత్తా చాటాలని ప్రణాళికలను రచిస్తున్నాయి. ఈ క్రమంలో గెలుపు గుర్రాల కోసం ఆయా పార్టీలు వెతుకుతున్నాయి.

**మండలాల వారీగా ఓటర్లు**

| మండలం | పురుషులు | మహిళలు |
|---|---|---|
| డిచ్‌పల్లి | 21,813, | 25,080 |
| నవీపేట | 21,495, | 24,822 |
| నందిపేట | 19,416, | 22,835 |
| భీమ్‌గల్: | 18,183, | 21,087 |
| జక్రాన్‌పల్లి: | 16,527, | 19,189 |
| ఆర్మూర్: | 14,161, | 16,654 |
| బాల్కొండ: | 12,012, | 13,919 |

### బరిలో కుటుంబ సభ్యులు

ఈ ఎన్నికలకు ఇంకా రిజర్వేషన్లు ఖరారు కాలేదు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయిన అనంతరం షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. మహిళా రిజర్వేషన్లు వస్తే బలమైన నాయకులు తమ భార్యలను లేదా కుటుంబ సభ్యులను బరిలోకి దించేందుకు సిద్ధమవుతున్నారు. కాగా అధికార పార్టీతో ఆశావాహుల సంఖ్య భారీగా ఉంది. క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న అభ్యర్థుల కోసం బీజేపీ వేట సాగిస్తోంది. ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని గులాబీ పార్టీ సైతం ప్రణాళికలు రచిస్తోంది.

## ప్రజావాణికి 91 ఫిర్యాదులు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలన్నారు. ఆయనతో పాటు సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, ఆర్డీవో రాజేంద్ర కుమార్, బోధన్ ఏసీపీ శ్రీనివాస్‌లు వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## మోతెలో 12 అడుగుల శివాజీ విగ్రహం ఏర్పాటు..

**అక్షరటుడే, భీమ్‌గల్(వేల్పూర్):** వేల్పూర్ మండలంలోని మోతె గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు అడుగులు పడ్డాయి. గ్రామంలో 12 అడుగుల భారీ శివాజీ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని గ్రామస్థులు నిర్ణయించగా, ఇందుకు సంబంధించిన తయారీ పనులను ప్రముఖ శిల్పి శ్రీనివాస్‌కు అప్పగించారు. సోమవారం విగ్రహ తయారీదారుని కలిసిన ప్రతినిధుల బృందం, విగ్రహ తయారీకి సంబంధించి ఆర్డర్ ఇచ్చారు. ఈ విగ్రహ ఏర్పాటుకు అయ్యే పూర్తి ఖర్చును ప్రముఖ దాత అల్లపుల్ల గంగారెడ్డి భరిస్తున్నారు. కార్యక్రమంలో మోతె గ్రామ ఉపసర్పంచ్ కర్రోల్ల పరంజ్యోతి కుమార్, దామ సాయన్న, మేర మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్‌కు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు: నగేష్‌రెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ:** మహిళా రిజర్వేషన్‌పై బీజేపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తాము ఖండిస్తున్నామని.. డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి అన్నారు. తమ పార్టీ మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మహిళా రిజర్వేషన్లకు ఎప్పుడు కూడా వ్యతిరేకం కాదన్నారు. మహిళా రిజర్వేషన్ పేరుతో బీజేపీ చేస్తున్న నియోజకవర్గాల పునర్విభజనకు మాత్రమే వ్యతిరేకమని స్పష్టం చేశారు.

కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన పేరుతో ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందన్నారు. 2023లో మహిళ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పూర్తి మద్దతు తెలిపిందని, బీజేపీకి మహిళలపై చిత్తశుద్ధి ఉంటే ప్రస్తుతం ఉన్న 543 పార్లమెంట్ స్థానాల్లో మహిళ రిజర్వేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ స్థాయిలో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీది అని నగేష్‌రెడ్డి అన్నారు. గతంలో సోనియాగాంధీ, మన్మోహన్ సింగ్ నాయకత్వంలో మహిళా బిల్లును ప్రవేశపెట్టినప్పుడు బీజేపీ వ్యతిరేకించిందని, సోనియా గాంధీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని ఆలోచనతో ఎప్పటినుంచో ఈ బిల్లును ముందుకు పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ప్రయత్నించారు. 2023లో మహిళ బిల్లు ప్రవేశపెట్టినప్పుడు కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మద్దతు తెలిపిందని.. కానీ ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ మహిళా రిజర్వేషన్ పేరుతో కుట్రలు చేస్తూ కాంగ్రెస్ పార్టీపై బురద చల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కోశాధికారి భక్తవత్సలం, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు కౌడపు శరత్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు నరేంద్ర గౌడ్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు సంతోష్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు యాదగిరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రఘు, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, మహిళా కాంగ్రెస్ నాయకులు అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా బసవేశ్వర జయంతి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మహాత్మా బసవేశ్వర జయంతి ఉత్సవాలను సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఇన్‌ఛార్జి అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, మహనీయులను స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో ముందుకు సాగేందుకు వీలుగా తెలంగాణ ప్రభుత్వం మహనీయుల జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. కుల, మత, లింగ, వర్గ, వర్ణ భేదాలకు వ్యతిరేకంగా బసవేశ్వర చేసిన కృషి ఎంతో గొప్పదని కొనియాడారు. అందుకే ఆయనను విశ్వ గురువుగా, గొప్ప దార్శనికుడిగా, సంస్కారవాదిగా ప్రపంచం కీర్తిస్తుందని గుర్తు చేశారు. మహనీయుల ఆలోచన విధానాలతో నేడు మనమంతా ముందుకు సాగితే సమాజం సత్వర అభివృద్ధి సాధించేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. వీరశైవ సమాజ్ ప్రతినిధులు మాట్లాడుతూ, రుద్రభూమి ఏర్పాటు గురించి ప్రస్తావించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి నర్సయ్య, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వీరశైవ సమాజ్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి బస్వరాజ్, ప్రతినిధులు సిద్ధిరాములు, రాజు, సంతోష్, నాగరాజు, సదాశివ్, కాశీనాథ్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పట్టణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ మ్యాపింగ్ ప్రక్రియపై సోమవారం కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ మ్యాపింగ్ 95 శాతానికి పైగా జరిగిందని, తెలంగాణలోనూ వేగవంతం చేయాల్సి ఉందన్నారు. ఈఆర్వోలు, ఏఈఆర్వోలు మ్యాపింగ్ ప్రక్రియ విషయంలో సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు, సూపర్‌వైజర్లకు దిశా నిర్దేశం చేస్తూ ఉండాలన్నారు. బూత్ స్థాయిలో ఆయా రాజకీయ పార్టీల ఏజెంట్ల నియామకానికి సంబంధించి ఇప్పటికే పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినందున వారి సహకారం తీసుకోవాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగి తమ పరిధిలోని బిఎల్ఓ లతో స్వయంగా మ్యాపింగ్ చేయించుకునేందుకు ఆసక్తి చూపితే మిగిలిన వారి మ్యాపింగ్ చేసేందుకు సులభతరమవుతుందని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఎన్నికల విభాగం సిబ్బంది సాత్విక్, విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం..



**అక్షర టుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని మచర్ల గ్రామాల్లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కట్ట నర్సయ్య మాట్లాడుతూ.. రైతులు తమ పంటను ప్రభుత్వ ఆధ్వర్యంలోని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. దళారులకు తక్కువ ధరలకు అమ్మి నష్టపోకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తూకం, రవాణా సౌకర్యాలు కల్పించాలని, లారీలు సమయానికి అందుబాటులో ఉంచి ధాన్యం తరలింపులో ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఐకేపీ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నసీర్, ఐకేపీ ఏపీఎం బుమేశ్వర్, వార్డ్ సభ్యులు, వీడీసీ అధ్యక్షులు గంజి మహేందర్ పాల్గొన్నారు.

## ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి



**అక్షరటుడే, భీమ్‌గల్:** ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని, పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగుల సంతోష్ కుమార్ సూచించారు. మండలంలోని పల్లికొండ గ్రామంలో కొనసాగుతున్న పనులతో పాటు పల్లికొండ, పురానిపేట నర్సరీలను ఆయన సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఎన్ఎంఎంఎస్ ద్వారా నమోదవుతున్న ముఖ హాజరును పరిశీలించారు. ఎండల తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయమే పనులకు హాజరు కావాలని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. జాబ్ కార్డులు, వేతనాల చెల్లింపుల్లో ఏవైనా సమస్యలుంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.




## ఆర్మూర్ బల్దియాలో

# ఆ ముగ్గురు..!

బల్దియా కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం అత్యంత ముఖ్యమైంది. పెద్ద మొత్తంలో లావా దేవీలు సైతం ఈ సెక్షన్‌లోనే జరుగుతాయి. కాగా.. ఆర్మూర్ బల్దియా లోని ఈ సెక్షన్‌ను ఇద్దరు ముగ్గురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రాజ్యమేలు తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నారు. ఉన్నతా ధికారులను మచ్చిక చేసుకుని.. అంతా తామై నడుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

– అక్షరటుడే ఆర్మూర్

■ ఇంజినీరింగ్ విభాగంలో వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలు

మున్సిపల్‌లో పలువురు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది రాజ్యమేలుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇంజినీర్ విభాగంలో డీజిల్ వాడకం భారీగా పెరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విభాగంలో ఒక మున్సిపల్ ట్రాక్టర్‌తో పాటు ఒక ప్రైవేట్ ట్యాంకర్ వినియోగిస్తున్నారు. ఈ రెండు ట్రాక్టర్లు నాలుగు రోజులకు ఒకసారి 20 లీడర్ల డీజిల్‌తో డివైడర్ మధ్యలో చెట్లకు నీళ్లు పట్టడం, దహన సంస్కారాల సమయంలో స్నానాలకు నీళ్ల సప్లయ్ జరుగుతోంది. అయితే అక్కడ కూడా రూ.500 నుంచి రూ.వెయ్యి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.. కానీ శానిటరీ విభాగంలో అంతకంటే ఎక్కువే ట్రాక్టర్లు, ఆటోలు తిరుగుతున్నా ఇంత డీజిల్ వినియోగం జరగట్లేదని మున్సిపల్ ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు.

### ప్రతినెలా రూ.లక్షల్లో డీజిల్ బిల్లులు..

శానిటరీ విభాగంలో చెత్త సేకరణకు పదుల సంఖ్యలో ఆటోలు, ట్రాక్టర్లను వినియోగిస్తుండగా కేవలం ఇంజనీర్ సెక్షన్‌లో రెండు ట్రాక్టర్లనే వినియోగిస్తూ ప్రతినెలా రూ.లక్షల్లో డీజిల్ బిల్లులు లేపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెక్షన్ అధికారులు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఏకమై అడ్డగోలుగా బిల్లులు పెట్టి మున్సిపల్ ఖజానాకు గండి కొడు తున్నారని మున్సిపల్ కార్యాలయంలో ఇతర సిబ్బంది చర్చించుకుంటున్నారు. ఆ సెక్షన్‌లో రెగ్యులర్ అధికారుల అండదండతో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా డీజిల్ వినియోగం పేరుతో దండుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది.

### అందరికీ డీజిల్ అక్కడే..

మున్సిపల్ కార్యాలయంలోని వివిధ సెక్షన్లకు సంబంధించిన కొంతమంది ఉద్యోగులు, సిబ్బంది మున్సిపల్ ఖాతాలోనే తమ వాహనాలలో డీజిల్, పెట్రోల్ పోయించుకుంటున్నట్లు సమాచారం. దూర ప్రయాణాలకు వెళ్తే మున్సిపాలిటీకి సంబంధించిన పెట్రోల్ బంక్‌కు వెళ్లి ట్యాంక్ ఫుల్ చేసుకొని వెళ్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు శ్రద్ధ వహించి మున్సిపల్ ఆదాయానికి గండి పడకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

**అక్షరటుడే, భీమ్‌గల్ (బాల్కొండ):** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో మంగళవారం వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆర్మూర్ డీఈ బి.రఘు, పెర్కిట్ ఏడీఈ శ్రీనివాస్, బాల్కొండ ఏఈ కిషన్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సీజీఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్ నారాయణ ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. బాల్కొండ, పెర్కిట్, ముప్కాల్, మెండోరా మండలాల వినియోగదారులు సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు.

## జగిత్యాలకు తరలిన బీఆర్ఎస్ నాయకులు



**అక్షరటుడే, మెండోరా:** జగిత్యాలలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సభకు పోచంపాడ్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. మాజీ సర్పంచ్ మిస్బా, ఉప సర్పంచ్ సంపంగి సతీష్, టౌన్ ప్రెసిడెంట్ రాజు నాయకత్వంలో అజార్, నాగరాజు, రాహుల్, పరమేష్, నాగరాజ్ తదితర కార్యకర్తలు జగిత్యాలకు వెళ్లారు.

## ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు



**అక్షరటుడే, లింగంపేట:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు జన్మదిన వేడుకలను సోమవారం లింగంపేట మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు భీమ్ రావు మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రతి పేదోడికి న్యాయం జరిగిందన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు దూరదృష్టి కలిగిన గొప్ప నాయకుడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు విశ్వేశ్వర్ శర్మ, కృష్ణ, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**అక్షరటుడే, భీమ్‌గల్ (వేల్పూర్):** రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గడ్డం నర్సారెడ్డి సూచించారు. బుధవారం పడగల్ గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి తక్కువ ధరకు పంటను అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల రాజు, ఉపసర్పంచ్ నరేందర్, ఏఎంసీ డైరెక్టర్ గంగాధర్, నాయకులు దామోదర్ గౌడ్, రమణ, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో రైతు మృతి..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మండలం ఖానాపూర్ గ్రామానికి చెందిన రైతు అక్కనపల్లి శివరాం (58) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ కథనం ప్రకారం.. శివరాం తన వ్యవసాయ క్షేత్రంలో ఎర్రజొన్న సొప్పకు నిప్పంటించాడు. అయితే ప్రమాదవశాత్తు పక్కనే ఉన్న బోరుకు, పానెల్ బోర్డుకి మంటలు వ్యాపించాయి. దీంతో శివరాం పానెల్ బోర్డు నుంచి కరెంటు వైర్లు తీసేందుకు ప్రయత్నం చేయగా విద్యుత్‌షాక్ తగిలింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

## మహిళా బిల్లు అమలులో మోదీ ప్రభుత్వం వైఫల్యం



**అక్షరటుడే, భీమ్‌గల్ (వేల్పూర్):** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మహిళా బిల్లును నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టి మహిళలకు అన్యాయం చేస్తోందని మహిళా కాంగ్రెస్ వేల్పూర్ మండలాధ్యక్షురాలు స్వరూప విమర్శించారు. వేల్పూర్ మండల కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా బిల్లును తక్షణమే అమలు చేయకుండా కాలయాపన చేయడం మహిళలపై బీజేపీకి ఉన్న చిన్నచూపును తెలియజేస్తుందన్నారు. గతంలోనే కాంగ్రెస్ పార్టీ చొరవతో ఆమోదం పొందిన బిల్లును యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బీజేపీ నాయకులు ఇప్పటికైనా స్పందించి కేంద్రంపై ఒత్తిడి తేవాలని, లేనిపక్షంలో వారిని గ్రామాల్లో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో సాహెబ్‌పేట్ సర్పంచ్ సుమలత, అమీనాపూర్ సర్పంచ్ సౌందర్య, వెంకటాపూర్ సర్పంచ్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## కాటేపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం..

**అక్షటుడే, పెద్దకొడప్‌గల్:** మండలంలోని కాటేపల్లి గ్రామంలో పలువురు లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం చేశారు. గ్రామానికి చెందిన లబ్ధిదారుడు గోకన్ రమేష్ గౌడ్ సోమవారం గృహప్రవేశం చేయగా.. కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. అనంతరం ఆయన లబ్ధిదారులకు శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు వినోద్, శ్యామప్ప పటేల్, మల్లప్ప పటేల్, గణపతి రావు, నాగనాథ్ తదితరులు పాల్గొన్నారు.



## రైల్వేకమాన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని రైల్వే కమాన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ మేరకు వన్ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి వివరాలు వెల్లడించారు. ఈనెల 19న సాయంత్రం రైల్వే స్టేషన్ కమాన్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి పడిఉన్నాడనే సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతడికి జీజీహెచ్‌కు తరలించగా.. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లుగా పేర్కొన్నారు. మృతుడి వయస్సు 60ఏళ్లు ఉంటాయని.. కూలీ పనులు చేసేలా ఉన్నాడని పోలీసులు తెలిపారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని.. ఇతర సమాచారం కోసం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

## గ్రామపంచాయతీ ట్రాక్టర్‌కు నిప్పు



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం రాంచంద్రపల్లిలో పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించారు. ఈ ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న సర్పంచ్ తోగర్ల భూషణ్, పంచాయతీ కార్యదర్శి నరేంద్ర వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. అనంతరం ఎంపీడీవో గంగాధర్, మాక్లూర్ ఎస్సై సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎల్లారెడ్డిలో మహాత్మా బసవేశ్వర జయంతి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పట్టణంలో సోమవారం మహాత్మా బసవేశ్వర జయంతిని వీరశైవ జంగమ లింగాయత్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నీల కంఠేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బసవేశ్వర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎల్లారెడ్డి మండల వీరశైవ లింగాయత్ అధ్యక్షుడు ముత్తి వీరప్ప సభ్యులు మాట్లాడారు. మహాత్మ బసవేశ్వరుడు 12వ శతాబ్దానికి చెందిన గొప్ప భారతీయ తత్త్వవేత్త, సంఘ సంస్కర్త, కవి, లింగాయత్ ధర్మ స్థాపకుడని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కపిల్ బసప్ప, జంగం సంగప్ప, నాయికోటి రవీందర్, శ్రీరామ్, హనుమంతప్ప, అనిల్, శేఖర్, భరత్, రవీందర్, రామప్ప సభ్యులు పాల్గొన్నారు.



## పెద్దకొడప్‌గల్‌లో రైతుల ఆందోళన




**అక్షటుడే, పెద్దకొడప్‌గల్:** రైతులు తాము పండించిన జొన్న పంట విక్రయానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ రైతులు పండించిన జొన్న పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని అధికారులకు అనేకసార్లు వినతిపత్రాలు అందజేశామన్నారు. కానీ ఇప్పటివరకు కేంద్రాలను ఏర్పాటు కాకపోవడంతో గత్యంతరం లేనిస్థితిలో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించిన పంటలను ప్రభుత్వం కొనకుండా ఆలస్యం కావడంతో దళారులు ఇష్టారాజ్యంగా తమకు నచ్చిన రేట్లకు పంటను కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులు తమ పంటలు ఎక్కడికక్కడ కుప్పలు పోసి ఉంచారని.. అకాల వర్షాలు వస్తే ఎలా అని రైతులు మదనపడుతున్నారన్నారు. ప్రభుత్వం పంటలను కొనకుండా ఆలస్యం చేయడంతో దళారులు లాభపడుతున్నారన్నారు. అప్పులు చేసి పంటలను పండిస్తున్నారని వారు వడ్డీలకే సరిపోవట్లేదని చెప్పారు. విషయం తెలుసుకున్న తహశీల్దార్, పోలీసులు రైతులతో మాట్లాడారు. ప్రభుత్వానికి సమస్యను నివేదిస్తామని పేర్కొనడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.